

# రోగాలు - అనురోగాలు

## - డా.కె.వివేకానంద మూర్తి



*(క్రిందటి సంచికనుంచి కొనసాగింపు)*




'ఇది నా పెర్సనల్ టెలిఫోన్ నెంబరు. ఎప్పుడైనా నన్ను డైరెక్టుగా కాంటాక్ట్ చేయవచ్చు. ఏ చిన్న సాయమైనా నాతో మాట్లాడ్డానికి సందేహించవద్దు.' అంటూ భానూరావు బాలరాజుకి వొక నెంబరు రాసి యిచ్చారు. బాలరాజు నెంబరు తీసుకుని జాగర్తగా జేబులో పెట్టుకున్నాడు.

మీటింగు యాటింగు తర్వాత ముగ్గురూ లేచారు. 'పెళ్లికి పిలవడం మర్చిపోవద్దు' అని భానూరావు బైబై చెప్పారు. బాలరాజు, రేఖ వొకర్నొకరు చిరునవ్వులతో సిగ్గుపడుతూ చూసుకోడం మానేసి చాలా వారాలయింది.

'యిసయం శానా పోగయింది డాౘ్టారూ!' అంది మందాకిని క్యూర్ హాస్పిటల్ కాంటీన్లో కాఫీ టేబుల్ దగ్గర బాలరాజుతో.

'యిన్నాల్లుగా యిక్కడ పంజేత్తన్నా యీ యవ్వారం అంతా యిప్పుడే తెలిసింది. నాకు నోరడిపోనాది' అంది చాముండేశ్వరి యెదురుగా వున్న బాలరాజుతో.

'వెరీగుడ్ వర్క్. అంతా వివరంగా చెప్పండి' అన్నాడు బాలరాజు.

మందాకిని మాట్లాడింది. 'మీరు చూసిన రగస్యం వార్డులో డయాబిటిక్కోల్లని పోగేసి, అందరికీ ఆ కొత్త మందు ఏటదీ?'

'డయబాలిక్' అందించాడు బాలరాజు.

'అదే ఆ డవిబాలిక్ అందరికీ యిత్తన్నాడు నాగదాసు.

అదిచ్చినాల్లందరికీ స్మారకం పోతోంది. ఆల్లంతా ఆ మందు తీసుకున్నాక పిచ్చి ముకాలేసుకుని, కదల్లేక అలాగే పడుకుండిపోయి, కప్పుకేసి గుడ్లప్పగించి చూస్తా వుండిపోతన్నారు.' మందాకిని ఆగింది. చాముండేశ్వరి అందుకుంది -

'ఆరిలో వారానికి యిద్దరు, ముగ్గురూ పైకెల్లిపోతున్నారు. పోయినోల్లని యెనక డోర్లోంచి యెవరికీ తెలీకుండా సావులమదుంకేసి వాన్‌లో సాగనంపేత్తన్నారు. ఏవయ్యారని యెవురడిగినా మాకు తెల్దంటే మాకు తెల్దని తప్పిం చేసుకుంతన్నారు. ఈ యవ్వారం నెల్లతరబడి సాగుతోంది.'

మందాకిని మధ్యలో అందుకుంది. 'పోయినోల్లందరూ మంచోల్లు, వార్డులో వున్నోల్లు ఆల్ల తీపి గురుతులు'

'అంటే' - అడిగాడు బాలరాజు.

'తీపి గురుతులంటే మిగిలి యేల్లాడుతున్న డయాబిటిక్కోల్లు.'

'నిజమే. ఇది చాలా సీరియస్ మేటర్. నాగదాసు చేసేది రీసెర్చి కాదు. అమాయకుల ప్రాణాలతో ఆడుకుంటున్న నరమేధం' బాలరాజు వుద్రేకంగా లేచాడు.

'యేం సేద్దారిప్పుడు?' అడిగింది చాముండేశ్వరి.

'చెయ్యాల్సిందొక్కటే. ఈ అరాచకాన్ని ఆపాలి. నాగదాసుని లేపాలి.

'అంటే లేపెయ్యాలి - అరదమైంది డాట్టారూ' అంది మందాకిని.

'మీరిద్దరూ చాలా గొప్ప సాయం చేశారు. మీరు లేకపోతే యివన్నీ యీజీగా తెలిసేవి కావు' అన్నాడు బాలరాజు.

'మీరు మంచోరు డాట్టారూ - మీకోసం మేవిద్దరం యెనక సూపులు సూడం. నాయం, దర్మం అంటే మీలాగా మాకూ పేనమే' అంది చాముండేశ్వరి, మందాకినితో చూపు కలుపుతూ.

'ఆ మాట చాలు నాకు. నేను రంగంలోకి దిగుతాను. మీరు నా వెనక వుంటే చాలు. మనం మళ్ళీ కల్సుకుందాం' అని బాలరాజు కదిలాడు.

మందాకినీ, చాముండేశ్వరి కదిలే బాలరాజుని ప్రేమ గౌరవాలతో చూస్తూవుండిపోయారు.

బాచిలర్స్ డెన్ బాల్కనీ మీద హిస్టరీ శర్మగారు పాహియాన్, బాలరాజు మాట్లాడుకుంటున్నారు.

'వీడికిదేం రోగం' అని ముక్కుమీద వేలేసుకున్నారు అంతా విన్న హిస్టరీ శర్మగారు.

'కొత్త మందు మార్కెట్లోకి వదిలి మిలియన్సుతో కోట్ల మూటలు కట్టుకుపోదావని ఆశ ఆ నాగదాసుగాడికి' అన్నాడు పాహియాన్.

'నెక్స్ట్ స్టెప్ ఏదో ఆలోచించి వెయ్యి. ఆ నాగదాసు పాముని కూడా కాటేసే రకం' అన్నారు శర్మగారు.

'ఈ విషయం ముందుగా రేఖతో మాట్లాడనా అని ఆలోచిస్తున్నాను' అన్నాడు బాలరాజు.

'ఎంతైనా మావయ్యకదా. ఎదురు తిరిగితే?' అడిగాడు పాహియాన్.

'రేఖ అర్థం చేసుకుంటుందనే నా వుద్దేశం. ఆమె అన్యాయం సహించదు. తప్పుని యెదుర్కోడంలో తన పర భేదాల్లేవు తనకు.'

'అయితే సందేహం దేనికి? ఆమె నీకు తోడయితే పరిష్కారం మరింత సుళువు' అన్నారు శర్మగారు.

'నాగదాసుని యెలా యెదుర్కోవాలా అని -' అన్నాడు బాలరాజు.

'ఎలా యేవిటి? అలాంటి వాడితో యుద్ధం తప్పదు. ధర్మ రక్షణ కోసం రాముడు బాణాల్ని, క్రిష్ణుడు చక్రాన్ని ధరించలా? దేవుణ్ని ప్రార్థించు. ధర్మాన్ని నమ్ము. ధర్మ రక్షణకు పోరాడేవారికి వోటమి వుండదు' అన్నారు హిస్టరీ శర్మగారు.

'అవును. మాస్టారు చెప్పింది హిస్టరీ. మన బాలరాజు యిప్పుడా హిస్టరీకి కొత్త పేజీలు తగిలిస్తాడు' అన్నాడు పాహియాన్.

'రేపే రేఖని కలుస్తాను. మరికొన్ని ప్రాణాలు అన్యాయానికి ఆహుతి కాకుండా అడ్డుకోవాలి' అని బాలరాజు నిశ్చయంగా అన్నాడు.

క్యూర్ హాస్పిటల్ డౌన్ ఫ్లోర్‌లో రహస్య వార్డు తలుపు తాళం తీసి నమస్కారం పెట్టి వెళ్లాడు బాచిబాబు.

బాలరాజు, రేఖ వార్డులోకి ప్రవేశించారు. లోపలికి అడుగెట్టగానే పేషెంట్స్‌ని చూస్తూ రేఖ వొక్కసారిగా విస్మయభరితురాలైంది.

'అయామ్ జస్ట్ షాక్డ్ బాలూ' అంది.

'చూడు. వీళ్లంతా డయాబెటిక్స్. కేస్ నోట్స్ చూడు. అంతా డయబాలిక్ మీదే వున్నారు. చూశావా! ఎవ్వరికీ యేమీ తెలీదు. జీవచ్ఛవాల్లా అంతా ట్రాన్స్‌లో వున్నారు' అన్నాడు బాలరాజు.

రేఖ బెడ్స్ దగ్గరికి నడుస్తూ, కేస్ నోట్స్ చూస్తూ 'మావయ్య నాతో వొక్కరోజు కూడా యీ రీసెర్చి ప్రాజెక్టు గురించి చెప్పలేదు.'

'చెప్పడానికి ఇదేం న్యాయబద్ధమైన ప్రొటోకాల్స్ అనుసరిస్తూ చేసే రీసెర్చికాదు. కొన్ని నెలలుగా యెంతమంది పోతున్నారో తెలిస్తే షాకవుతావు.'

'మన ట్రైనింగ్ ప్రాసెస్‌లో మావయ్య ప్రైవేట్ లైఫ్, ఆయన హాస్పిటల్ వ్యవహారాల్లో యెప్పుడూ తొంగి చూసేందుకు కూడా నేను ప్రయత్నించలేదు.' అంది రేఖ. 'ఏం చేద్దాం చెప్పు' అడిగాడు బాలరాజు.

'ఇదంతా బైట పెట్టాల్సిందే మావయ్యను నిలదీసి అడగాల్సిందే బాలూ - నువ్వు చేద్దామనుకున్నది చెయ్యి. నా చెయ్యి యెప్పుడూ నీ చేతిలోనే వుంటుంది' రేఖ కచ్చితంగా మాట్లాడింది.

'మన విషయంలో మీ మావయ్య దక్షుడయ్యే అవకాశంవుంది.'

'ఆయన దక్షుడైతే నువ్వు నా శివుడివి.

నేను మాత్రం దగ్ధం కాను. అవసరమైతే నీ మూడో కన్ను అరువు తీసుకుని అవసరం బట్టి తెరుస్తాను.'

'నాకు తెలుసు రేఖా. ఎప్పుడో నువ్వు నాలో సగం అయిపోయావు. చేసే ధర్మ రక్షణేదో యిద్దరం కలిసే చేద్దాం.' అన్నాడు బాలరాజు.

'అయామ్ ఆల్వేస్ విత్‌యు' అని రేఖ బాలరాజు విశాలమైన గుండెల మీద తల ఆనించింది. ఇద్దరూ వార్డు చివర్లో వున్నారు. ఇంతలో అవతలివేపు తలుపు దగ్గర యేదో అలికిడి అయింది.

బాలరాజు గోడ దగ్గరకు వెళ్లి స్విచ్ ఆన్ చేసి అన్ని లైట్లూ వేశాడు.

'ఇక్కడున్నారా? మీ కోసమే చూస్తున్నాను సరైన చోటే కలుసుకున్నాం' తలుపు దగ్గర బెడ్ పక్కన నిలబడిన నాగదాసు మాటలవి. అతన్ని చూసి బాలరాజు, రేఖ అదిరిపడలేదు. ఇద్దరూ నాగదాసుని కఠినంగా చూశారు. నాగదాసు మళ్లీ అన్నాడు. '- ఈ రీసెర్చి గురించి, యీ వార్డు పర్యవేక్షణ గురించి మీతో మాట్లాడదామనుకుంటున్నాను. ఈ రీసెర్చిలో యాక్టివ్ పార్టు తీసుకుని యిక మీరే యీ పేషెంట్స్‌ని మానిటర్ చెయ్యాలి. ఈ న్యూ డ్రగ్ అవుట్ కమ్ మనల్ని కొత్త

శిఖరాలకు చేరుస్తుంది. డయాబెటిస్ మానేజ్ మెంట్ హిస్టరీలో మనల్ని ప్రాణదాతలుగా వుదహరిస్తూ టెక్స్ట్ బుక్స్ అన్నీ మనపేర్లతో పాఠ్య భాగాలయి, కొత్త డాక్టర్లకు వెలుగు చూపిస్తాయి. ఇకముందు డయాబెటిక్స్ చావుని వెక్కిరించి ఆరోగ్యంగా అందరిలా హాయిగ బ్రతుకుతారు."

'స్టాపిట్' అరిచాడు బాలరాజు - అరిచాక మళ్లీ అన్నాడు.

'నీ రీసెర్చ్‌కి యిప్పటిదాకా యెంతమంది అమాయకులు ప్రాణాలు పోగొట్టుకున్నారో లెక్కపెట్టావా?

'మీరు లోంచి నువ్వులోకి వచ్చేశావన్నమాట.'

'నిన్ను నువ్వు అనకుండా అనవసరమైన మర్యాదనిపిస్తోంది. పేషెంట్స్ పట్ల నువ్వు ప్రవర్తించే తీరుకి, వారితో అతిహీనంగా మాట్లాడే నీ సంస్కారానికి నిన్ను వొక డాక్టరుగా అనుకోవడమే అమర్యాద.

'పేషెంట్స్‌తో నేను యెప్పుడేనా కాస్త కటువుగా వుంటే వుండివుండొచ్చు. అది వారి మంచికే. అయినా నేను పేషెంట్స్‌తో మాట్లాడ్డం నువ్వెన్నిసార్లు ఫాలో అయ్యావు గనుక?'

'నన్ను గుర్తుపట్టలేదా?' అడిగాడు బాలరాజు. నాగదాసు మాట్లాడలేదు. కానీ ప్రశ్నార్థకంగా చూశాడు.

***(కొనసాగింపు వచ్చేనెలలో)***

Post your comments

